Andhra Jyothi

## Clouds of trouble fade away

Date: 01-11-2010 | Edition: Hyderabad | Page: 5 | Source: Bureau | Clip size (cm): W: 18 H: 14



# తొలగిన సంక్షోభం మబ్బులు

## ముఖ్యమంత్రి రోశయ్య

హైదరాబాద్ (బిజినెస్ బ్యూరో):

సంక్షోభం ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోనూ ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నందున మంచి రోజులు మళ్లీ వచ్చినట్లేనని ముఖ్యమంత్రి రోశయ్య అన్నారు. ఆదివారం ఇక్కడ ప్రముఖ ఆర్థికవేత్త, ఐడిబిఐ డైరెక్టర్ కె నరసింహమూర్తి రచించిన 'ఆర్థిక భారత్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై కీలక అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. రెండేళ్ల క్రితం సంక్షోభం కోరల్లో చిక్కుకున్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేకులు పడ్డాయని, ఒక దశలో సంక్షేమ పథకాలకు నిధులే కరువయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి కష్టకాలాన్ని రాష్ట్ర ప్రజలు విజయవంతంగా అధిగమించగలిగారని, ఇంత త్వరగా సంక్షోభం నుంచి గట్టెక్కుతామని అనుకోలేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి మెరుగ్గానే ఉందని, రాబోయే కాలంలో మరింత మెరుగైన పనితీరును అంచనా వేస్తున్నామని ఆయన అన్నారు.

**'ఆర్థిక భారత్' అదరహో..**

ఆర్థికపరమైన విషయాలు అత్యంత సంక్లిష్టమైనవి. ఇవి ఓ పట్టాన ఎవరికీ అర్థం కావు. ఆర్థిక వ్యవస్థనే విశదీకరిస్తూ దేశ భవిష్యత్తును అంచనా వేయడమంటే మాటలు కాదని ముఖ్యమంత్రి రోశయ్య అభిప్రాయపడ్డారు. ఈ క్లిష్టతరమైన ప్రశ్నలకు ఆర్థిక భారత్ ద్వారా నరసింహమూర్తి సమాధానం చెప్పారని, ఈ పుస్తకం సమగ్రంగా ఉందని ఆయన ప్రశంసించారు. ఆర్థికాంశాలపై ప్రజలను చైతన్యం చేస్తూ పత్రికల్లో సాగించిన నరసింహమూర్తి రచనా వ్యాసాంగం రాజకీయనాయకులు చేసే సేవకంటే అత్యంత విశిష్టమైనదని రోశయ్య కొనియాడారు. లక్ష కోట్ల బడ్జెట్‌గా ప్రశంసలందుకునే రాష్ట్ర బడ్జెట్ తయారీలోనూ నరసింహమూర్తి సలహాలు దాగి ఉన్నాయని, ప్రీ బడ్జెట్ కన్సల్టేషన్‌లో భాగంగా ఆయన నుంచి తీసుకునే సలహాలు అత్యంత విలువైనవిగా భావిస్తానని ఆయన అన్నారు. దేశ ప్రజల శ్రేయస్సే వ్యాపకంగా చేసుకున్న ఈ మేధావి నుంచి భవిష్యత్ సంక్షోభాలకూ పరిష్కార మార్గాలు లభించాలని తాను కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.




'ఆర్థిక భారత్' పుస్తకావిష్కరణలో పాల్గొన్న ముఖ్యమంత్రి రోశయ్య. చిత్రంలో లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ, ట్రాయ్ చైర్మన్ జెఎస్ శర్మ, కేంద్ర మంత్రి పురందేశ్వరి, పుస్తక రచయిత కె నరసింహ మూర్తి

సమ్మిళిత వృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులైనప్పుడే అభివృద్ధి భారతం సాక్షాత్కరిస్తుందని ఆర్థిక భారత్‌ను సమీక్షించిన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ అభిప్రాయపడగా, ప్రజాస్వామ్యంలోనూ చైనీస్ డ్రాగన్‌కు దీటుగా భారత్ ఎదుగుతోందని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి పురంధేశ్వరి అన్నారు.

2050 నాటికి అగ్రరాజ్యం అమెరికాను అధిగమించి ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని, ఆ స్థాయికి ఎదిగే క్రమంలో సామాన్యుల్లో ఆర్థికాంశాలపై అవగాహన పెరిగేలా ఆర్థిక భారత్‌లాంటి మరిన్ని రచనలు రావాలని ట్రాయ్ చైర్మన్ జెఎస్ శర్మ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక భారత్ ఇ-బుక్‌ను పురందేశ్వరి ఆవిష్కరించగా, అంజనీ సిమెంట్స్ ఎండి విష్ణు రాజు, సిక్కిం మాజీ గవర్నర్ వి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# Andhra Jyothi

## Clouds of trouble fade away

**Date: 01-11-2010 | Edition: Hyderabad | Page: 5 | Source: Bureau | Clip size (cm): W: 18 H: 14**



# త్వరలో అవాంఛనీయ కాల్స్ నిషేధ చట్టం

హైదరాబాద్ (బిజినెస్ బ్యూరో): మొబైల్ వినియోగదారులకు శుభవార్త. వేళాపాళా లేకుండా టెలీ మార్కెటింగ్ కాల్స్‌తో సతమతమవుతున్నారా? ఇకపై మీకు ఆ బెంగ అక్కర్లేదు. ఈ తరహా కాల్స్‌ను నిషేధిస్తూ నవంబర్ 15లోగా కొత్త చట్టం అమల్లోకి రానుంది. కొంతకాలంగా ఈ చట్టాన్ని తీసుకురావడానికి చేసిన కసరత్తు పూర్తయిందని, త్వరలోనే ఈ చట్టం అమల్లోకి వస్తుందని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) చైర్మన్ జెఎస్ శర్మ ప్రకటించారు. ప్రముఖ ఆర్థికవేత్త కె. నరసింహమూర్తి రాసిన 'ఆర్థిక భారత్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ టెలీ మార్కెటింగ్ కాల్స్‌తో వ్యాపారం చేసే కంపెనీలకు కొత్త చట్టం అడ్డుకట్ట వేస్తుందని అన్నారు. ఈ విధానం అద్భుతంగా పనిచేస్తుందని, కొన్ని టెలికాం సర్కిళ్లలో ఈ విధానం ఎలా పనిచేస్తుందో ఇప్పటికే రెగ్యులేటరీ పరీక్షించిందని ఆయన తెలిపారు. ఇటీవల సాక్షాత్తూ ఆర్థిక మంత్రి ప్రణబ్‌ముఖర్జీకే టెలీ మార్కెటింగ్ కాల్ రావడం, ఆ విషయంపై ఆర్థిక మంత్రి రుసరుసలాడటంతో టెలికాం శాఖ ఖంగుతిన్నది. తక్షణమే ట్రాయ్‌ను ఈ కాల్స్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల ఫలితమే నవంబర్ 15 నాటికి వచ్చే కొత్త చట్టం. మూడేళ్ల క్రితం డూ నాట్ కాల్ పేరుతో ఆన్‌లైన్ రిజిస్ట్రీని ట్రాయ్ ఏర్పాటు చేసింది. అయితే.. దీనివల్ల ఎలాంటి ఫలితాలు లభించకపోవడంతో తాజా వ్యూహాన్ని ట్రాయ్ అనుసరించింది.



ట్రాయ్ చైర్మన్ జెఎస్ శర్మ

**ఇకపై డిటిహెచ్‌లో ఎఫ్‌డిఐ హవా..**

డిటిహెచ్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి త్వరలో పెరగనుంది. ఇప్పటివరకూ ఈ రంగంలో 49 శాతం ఎఫ్‌డిఐని అనుమతిస్తున్నారు. దీనిని 74 శాతానికి పెంచాలంటూ ట్రాయ్ సిఫారసు చేసింది. తమ సిఫార్సులకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సానుకూలంగా స్పందించిందని, తాము సూచించిన ప్రతిపాదనలను ఆమోదిస్తారని భావిస్తున్నట్లు ట్రాయ్ చైర్మన్ శర్మ తెలిపారు. ఈ సిఫారసుల్లో భాగంగా కేబుల్ ఆపరేటర్ల సేవల్లో ఎఫ్‌డిఐని 49 శాతం నుంచి 26 శాతానికి తగ్గించాలని కూడా రెగ్యులేటరీ సూచించింది.